క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో గల సబ్ స్టేషన్ 11కేవీ తల్లంపాడు ఇండస్ట్రియల్, తల్లంపాడు రూరల్‌లో మెయింటెన్స్ కారణంతో శుక్రవారం విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందని ఏదులాపురం ఏఈ ప్రభాకర్‌రావు గురువారం తెలిపారు. దీంతో మద్దులపల్లి, తెల్దారుపల్లి, పొన్నేకల్లు తల్లంపాడు, గుర్రాలపాడు, ఏదులాపురం పంచాయతీల్లో ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

18న నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 18న సాయంత్రం 94వ నెలనెలా వెన్నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన బీవీకే క్రియేషన్స్ ఆధ్వర్యాన 'తితిక్ష'నాటికను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాక 'నా ఆడపిల్ల', 'నాన్న ఉత్తరం'వంటి లఘు చిత్రాల ప్రదర్శన ఉంటుందని కళాకారులు, కళాభిమానులు, ప్రేక్షకులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్ రావు, కె.దేవేంద్ర, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, వేముల సదానందం, నామా లక్ష్మీనారాయణ కోరారు.

చెరువుల్లో నీటిని తరలించొద్దు

తిరుమలాయపాలెం: చెరువుల్లో నీటిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఇరిగేషన్‌శాఖ డీఈ బాణాల రమేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల వేట కోసం అక్రమంగా నీటిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జీఆర్పీ పోలీస్ పరిధిలోని ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ ప్రాంతంలో గుర్తుతెలియని 40 ఏళ్ల వ్యక్తి రైలు పట్టాల వద్ద మృతి చెందాడు. అతడి వద్ద ఖమ్మం నుంచి విజయవాడ వెళ్లే రైల్వే టికెట్ తప్ప ఏ ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, మృతదేహం కోసం ఎవ్వరూ రాకపోవడంతో శవపరీక్ష నిర్వహించి అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. రైల్వేపోలీసులు, వైద్య సిబ్బంది సమక్షంలో ఫౌండేషన్ బాధ్యులు గురువారం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	సింగిల్
సాయిరాం	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
ఆదిత్య	యమదొంగ
శ్రీనివాస	ఎలెవన్, దేశముదురు

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	30		20
కాకర	56	చుక్కకూర	3
బీర	60		20
దొండ	28	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	96	గోంగూర	4
గోరుచిక్కుడు	46		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	66		20
బీట్‌రూట్	40	-ఖమ్మం వ్యవసాయం	

దాహార్తి తీరే దారేది..?

శిథిల తొట్లు.. మూగజీవాలకు ఇక్కట్లు..

- నిరుపయోగంగా నీటి తొట్టెలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- అగమ్యగోచరంగా జీవాల పరిస్థితి
- పట్టించుకోని అధికారులు



కోనాయిగూడెంలో నీటి తొట్టెని తొలగించిన స్థలం (ఇన్‌సెట్) గతంలో నిర్మించిన నీటి తొట్టె(ఫైల్)

వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతీ గ్రామపంచాయతీలో రూ.లక్షలు వెచ్చించి నీటి తొట్టెలు నిర్మించారు. కాని అవి ఇప్పుడు నిరుపయోగంగా మారడంతో మూగజీవాలు దాహంతో అలమటిస్తున్నాయి. నీటి నిర్వహణను గాలికొదిలేయడంతో చాలాచోట్ల శిథిలావస్థలకు చేరగా.. మరికొన్ని ఏకంగా తొలగించారు. ఉన్న కొన్నింటిలోనూ నీటిని నింపేవారు కరువయ్యారు. దీంతో మురుగునీరు తాగుతూ దాహార్తి తీర్చుకుంటున్నాయి. - నేలకొండపల్లి

ఆరేళ్ల క్రితం నిర్మాణం..

గత ఆరేళ్ల క్రితం మూగజీవాల దాహార్తి తీర్చేందుకు కేంద్రం నిధులతో పాటు పంచాయతీ నిధులతో పాలేరు నియోజకవర్గంలో గ్రామాల్లో నీటి తొట్లు నిర్మించారు. కొంత కాలం వాటి నిర్వహణను పంచాయతీ సిబ్బంది పట్టించుకుని ఆ తర్వాత వదిలేయడంతో చాలా చోట్ల పగిలిపోయాయి. మరికొన్ని చోట్ల లీక్‌లు ఏర్పడి బురదగా మారడంతో మూగజీవాలు అక్కడే దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లోని పలు పంచాయతీలో నీటితొట్లు అడ్రస్ లేకుండా పోయాయి. దీంతో మూగజీవాల గోస పట్టించుకునే దిక్కు లేదని రైతులు వాపోతున్నారు.

దాహార్తి కోసం వెళ్లి ప్రమాదాలకు..



ఆరెగూడెంలో నీటిలో చిక్కుకున్న గేదెలు

జీపీల్లో నీటితొట్లు శిథిలావస్థకు చేరడంతో మూగజీవాలు వాటి దాహార్తి తీర్చుకునేందుకు పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ బావులను ఆశ్రయిస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతుండగా.. ఇటీవల మండలంలోని ఆరెగూడెం, అనంతనగర్ గ్రామాలకు చెందిన మూగజీవాలు వ్యవసాయ బావుల్లోకి దిగడంతో వివాదాలు చోటు చేసుకోగా.. మరో చోట ప్రమాదాలకు గురయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉన్న తొట్లనైనా మరమ్మతులు చేసి నీటిని అందించే ఏర్పాట్లు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి..



మూగజీవాలకు నీటి తొట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. కనీసం వాటికి ప్రత్యామ్నాయంగా నీటిని అందించే ఏర్పాట్లు చేయాలి. వేసవిలో నీరు దొరక్క అల్లాడుతున్నాయి. వాటి దాహార్తి తీర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

- కాశిబోయిన అయోధ్య, రైతు, సింగారెడ్డిపాలెం

అధికారులు స్పందించాలి..



మూగజీవాలకు నీటిని అందించే విషయంలో అధికారులు చిత్తశుద్ధి చూపించాలి. గతంలో నిర్మించిన నీటి తొట్లపై పర్యవేక్షణ లేకపోవటంతో ఈ పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి మూగరోదనను తీర్చాలి.

- రచ్చా నరసింహారావు, రైతు సంఘం నేత

నిధులు దుర్వినియోగం..



జీపీల్లో నిర్మించిన నీటి తొట్ల నిర్వహణపై అధికారులు పట్టించుకోవడం లేదు. కేంద్రం నిధులు మంజూరు చేసినా.. సక్రమంగా వినియోగించకుండా దుర్వినియోగం చేశారు. ఈవిషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- పాగర్తి సుధాకర్, బీజేపీ మండలాధ్యక్షుడు

మాస్టర్ ప్లాన్‌కు త్వరలో ఆమోదం

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మం నగర అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను త్వరలోనే ప్రభుత్వంతో ఆమోదింపజేయనున్నట్లురాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం 20వ డివిజన్ రామచంద్రయ్యనగర్‌లో రూ.72 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రెవెన్యూ, భూసంబంధిత సమస్యలను అదనపు కలెక్టర్, కేఎంసీ కమిషనర్ సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ఖమ్మం నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుండగా, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు సేకరించాక ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. కాగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తున్నామని చెప్పారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వచ్చేవారం నాటికి వెలువడుతుందని తెలిపారు. జీఓ 58 దరఖాస్తులపై రెవెన్యూ శాఖ సమన్వయంతో పరిశీలిస్తుండగా, ఆతర్వాత అర్హులకు ఇంటి పట్టాలు, నంబర్లు కేటాయిస్తామన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూములను ఆక్రమణల నుంచి కాపాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్ ప్రశాంతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ 'ప్లాన్'పై కార్పొరేటర్ల సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: సుడాతో పాటు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై కాంగ్రెస్ కార్పొరేటర్లు కేఎంసీ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. గతంలో నిర్వహించిన స్టేక్ హోల్డర్ల సమావేశానికి తమను ఆహ్వానించలేదని ఇటీవల పలువురు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చెప్పినట్లు సమాచారం. దీంతో ఆయన సూచనల మేరకు మేయర్ పునుకొల్లు నీరజ సమక్షాన కార్పొరేటర్లకు అధికారులు అవగాహన కల్పించినట్లు తెలిసింది. డివిజన్ల వారీగా రహదారుల విస్తరణ, చెరువులు, నాలాలు, కాల్వలు, మున్నేరు బఫర్ జోన్లపై వివరించినట్లు సమాచారం. దీంతో కార్పొరేటర్లు కొన్ని అంశాల్లో సూచనలు చేసినట్లు తెలిసింది. కాగా, గతంలో స్టేక్ హోల్డర్ సమావేశాలకు హాజరు కాని కార్పొరేటర్ల కోసం ఈ భేటీ ఏర్పాటుచేసినట్లు చెబుతుండగా, తమను పిలవకుండా సమావేశం నిర్వహించడం సరికాదని, తమ డివిజన్లలో సమస్యలు లేవా అని ప్రతిపక్ష కార్పొరేటర్లు అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. ఈ అంశంపై అధికారులు స్పందిస్తూ గతంలో మాస్టర్ ప్లాన్‌పై అవగాహన కల్పించలేదని అడిగిన కార్పొరేటర్ల కోసం ఈ సమావేశం నిర్వహించామని, త్వరలోనే పూర్తిస్థాయి ప్లాన్‌పై అందరితో సమావేశం వివరించినట్లు తెలిసింది.

కేఎంసీ సమాచారం

● కేఎంసీ క్వార్టర్స్‌లో అధికారుల విచారణ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన క్వార్టర్స్‌లో బయట వ్యక్తులు నివాసం ఉంటున్నారన్న సమాచారంతో గురువారం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా విచారణ చేపట్టినట్లు తెలిసింది. కేఎంసీకి చెందిన రెగ్యులర్ పీహెచ్ వర్కర్లకు ఇచ్చిన క్వార్టర్స్‌లో ఔట్ సోర్సింగ్ వర్కర్లతో పాటు బయట వ్యక్తులు ఉంటున్నట్లు అధికారుల దృష్టికి వచ్చిందని చర్చ జరుగుతుండడంతో ఏఎంసీ ఆరా తీసినట్లు తెలిసింది.

● డ్రైవర్ల పోస్టులకు బేరం..?

ఖమ్మం నగర పాలక సంస్థలో కొత్తగా కొనుగోలు చేయబోతున్న పారిశుద్ధ్య వాహనాలకు డ్రైవర్లను నియమించేందుకు ఉన్నతాధికారులకు తెలియకుండానే కొంతమంది పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈనేపథ్యాన ఇప్పటికే కొంత మంది వద్ద మాముల్లు తీసుకొని డివిజన్లలో ఏర్పాటు చేసినట్లు కేఎంసీలో చర్చ జరుగుతోంది. కేఎంసీలో ప్రతి చిన్న ఉద్యోగాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని, కొత్తగా కేఎంసీకి వచ్చే వాహనాలకు డ్రైవర్ల పోస్టులను ఇలానే బేరం పెట్టారని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు ముందుగా మేల్కొని ఇలాంటివాటికి అడ్డుకట్టవేయాలని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని చర్చించుకుంటున్నారు.

● కేఎంసీ ఆర్‌ఓ బదిలీ

ఖమ్మం నగరపాలక సంస్థలో రెవెన్యూ అధికారి (ఆర్‌ఓ)గా విధులు నిర్వర్తిస్తున్న జి.శ్రీనివాసరావును డిప్యుటేషన్‌పై మహబూబాబాద్‌కు బదిలీ చేస్తూ సీడీఎంఏ టీ.కే.శ్రీదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.శ్రీధర్‌ను కేఎంసీ ఆర్‌ఓగా బదిలీ చేశారు. ఇక ఖమ్మం శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీను డిప్యుటేషన్‌పై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తుండగా.. ఆయన డిప్యుటేషన్‌ను రద్దు చేశారు. తిరిగి కేఎంసీ ఎస్ఐగా పంపిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతితో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

కామేపల్లి: రైతులు లాభాలు పొందేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాతలింగాల రైతువేదికలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నేల సారవంతంతో పంట సాగుకు తక్కువ ఖర్చు కావడంతో పాటు పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. పంట మార్పిడి, భూసార పరీక్షలు, పంట వ్యర్థాలను కాల్చకుండా కలియదున్నడం, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు, పశువుల పెంపకంతో ప్రయోజనం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం రాయితీలపై అందిస్తున్న వాణిజ్య, పండ్ల సాగు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా కృషి విజ్ఞాన కేంద్రం, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు, వి.చైతన్య, జిల్లా రైతు సంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు, ఏఓ తారాదేవి, డాక్టర్ నాగులు, ఆకుల వేణు, గింజల నరసింహారెడ్డి, ఏఈఓ జగదీశ్వర్, రైతులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

కామేపల్లి: మండలంలోని మునుసుబ్‌బంజరలో గంగమ్మతల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు ఘనంగా చేశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నేడు గంగమ్మతల్లికి కల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

సమ్మె విజయవంతానికి విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కార్మికులు



సమ్మె నోటీసు అందిస్తున్న పంచాయతీ సిబ్బంది, సంఘం నాయకులు

తిరుమలాయపాలెం: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి గురువారం సీఐటీయూ ఆధ్వర్యాన కార్మికులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం సీఐటీయూ మండల నాయకుడు వీరన్న మాట్లాడుతూ.. కార్మికుల పోరాట ఫలితంగా కార్మిక హక్కులను కాపాడే 44 చట్టాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా కుట్ర పన్ని కరోనా సమయాన కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చలు లేకుండా పెట్టుబడిదారులకు అనుకూలంగా రద్దు చేశారని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా, కార్మికుల కనీస వేతనం అమలు చేయాలని, 60ఏళ్లు నిండిన ప్రతి అసంఘటిత కార్మికులకు రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని, దేశంలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని కోరారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కేటగిరీల వారీగా పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని, హమాలీ కూలీలు, కార్మికులకు ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపీఓకు సమ్మె నోటీసు..

రఘునాథపాలెం: సార్వత్రిక సమ్మెలో భాగంగా 20న నిర్వహించే సమ్మె నోటీసును శుక్రవారం పంచాయతీ సిబ్బంది ఎంపీఓకు అందజేశారు. అదే విధంగా ఎండాకాలం నేపథ్యాన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ కాపీలను సైతం అప్పగించారు. జీఓ ప్రకారం సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పిట్టల మల్లయ్య, నాయకులు రాందాస్, మంగీలాల్, రాజగోపాల్, లింగయ్య, రాము, సీతారాములు, శ్రీను, ఉపేందర్, వీరయ్య, నరేష్, విజయలక్ష్మి, బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఖమ్మం రామనరసయ్య విజ్ఞాన్ కేంద్రంలో ములకలపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. కార్మిక వర్గానికి ఉరి తాళ్లుగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యేంత వరకూ కార్మిక లోకం మొత్తం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు బొమ్మకంటి రమేష్, బజారు, బానోతు రవి, శ్రీను, శ్రీకాంత్, సిల్వరాజు, చందరావు, వెంకన్న, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

● యువతి వివాహానికి..



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని త్రీటౌన్ ప్రాంతం 46వ డివిజన్ జూబ్లీపురలోని నిరుపేద కుటుంబానికి చెందిన మాదాసు ఇందు వివాహానికి కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ మిత్రబృందం రూ.25వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. ఇందులో మంగ రవి స్టీల్ సామాన్లు, పూజా సామగ్రి, టెంట్ హౌస్ సామాన్లు, ప్రవీణ్, చీర సతీష్‌లు రూ.5వేల చొప్పున పవన్‌రూ. 3వేలు వెరసి మొత్తం రూ.25వేలు అందించారు. అలాగే సిటీ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్ తన వంతు సాయంగా రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు షేక్ రజ్జి, దేవర వెంకన్న, శనిగరం ఉప్పలయ్య, రమేష్, యాదయ్య, తుపాకుల మధు, జెట్ట కృష్ణయ్య, రామకృష్ణ, మేకల అశోక్, పాల్గొన్నారు.

● మృతుల కుటుంబాలకు..



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.10వేల సాయాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం కూసుమంచి, నాయకన్‌గూడెం, బోడియాతండా, గైగోళ్లపల్లి, లాల్‌సింగ్‌తండా, నర్సింహులగూడెం, కొత్తూరు గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలకు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, నాయకులు ఎండీ హఫీజుద్దీన్, బజ్జూరి వెంకటరెడ్డి, సేట్రాం నాయక్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామంలో ఇటీవల మృతిచెందిన దొంతు వసంత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. పార్టీ తరఫున కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు జోన్‌బోయిన పాపయ్య, ఖమ్మం జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోటేరు నర్సిరెడ్డి, యూత్ అధ్యక్షుడు గుండ్ల గోవర్ధన్, ఎలమరెడ్డి వెంకటరెడ్డి, వెంకన్న, షేక్ రహీం భాష, సత్యనారాయణ, కోటయ్య, శ్రీనివాస్, యాదగిరి, దశరథ, గోపి పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యలపై కేఎంసీ ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 60 డివిజన్లలో తమ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన సర్వేలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం శనివారం(నేడు) కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి చేస్తున్నట్లు సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ తెలిపారు. గురువారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు అవుతున్నా నగరంలో ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు, కొత్త పింఛన్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల కింద ఎటువంటి షరతులు లేకుండా ఒకేసారి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డ్ సమస్యకు, కమాన్‌బజార్-గాంధీచౌక్ మధ్య గేట్ సమస్యకు, సారథినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు శాశ్వత, శాస్త్రీయతతో కూడిన పరిష్కారం చేయాలని కోరారు. విలీన శివారు ప్రాంతాలకు అభివృద్ధి నిధులు కేటాయించాలని, నగరంలోని ప్రధానమైన రోడ్లు వెడల్పు చేయాలన్నారు. పలు ప్రాంతాల్లో బస్తీ దవాఖానాలు, త్రీటౌన్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. త్రీ టౌన్ మార్కెట్ వద్ద రైతులకు, కార్మికులకు రూ.5 భోజనం అందించాలన్నారు. ఈ ముట్టడిని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎ.జబ్బర్, దొంగల తిరుపతిరావు, నవీన్‌రెడ్డి, ఎస్‌కె.మీరా సాహెబ్, భూక్యా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, బి.ఉపేంద్ర, ఎస్‌కె.నాగులు మీరా పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల పరిశీలన..



లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న ఏఈ లింగా

నేలకొండపల్లి: ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లను హౌసింగ్ ఏఈ వి.లింగా పరిశీలించారు. నూతనంగా నియమించిన ఏఈ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ యర్రయ్య సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తిరుమలాపురంతండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రూపొందించిన నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపడతామని, దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పేరుకే ఫిర్యాదుల బాక్సా..?



రఘునాథపాలెం రేషన్‌షాపు స్టాక్ బోర్డు

ప్రతీ రేషన్ దుకాణం వద్ద వినియోగదారులకు కనపడేలా స్టాక్ బోర్డు, నిల్వ సరుకులు, మరో పక్క ఫిర్యాదుల బాక్స్ దానికి అనుబంధంగా అధికారుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు ఉంటాయి. కానీ రఘునాథపాలెం రేషన్‌షాపు వద్ద పేరుకే ఫిర్యాదుల బాక్స్, అధికారుల పేర్లు ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. అధికారి బదిలీ అయి ఏళ్లు గడుస్తున్నా.. పేరు మార్చక పోగా స్టాక్ వివరాలు కూడా తెలపడం లేదు. డీఆర్‌డీఓ విద్యాచందన ఇతర జిల్లాకు మారినప్పటికీ.. ఇంకా బోర్డులపై ఆమె పేరే కనిపిస్తుండడం గనార్హం. ఏదైనా ఫిర్యాదు చేద్దామంటే ఎవరికి చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లయీస్ అధికారులు ఎప్పటికప్పుడు వివరాలు అప్‌డేట్ చేసేలా చూడాలని కోరుతున్నారు. - ఖమ్మంఅర్బన్